# ప్రచారంలో దూసుకెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



మహదేవపూర్ : ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



గంగారం : నాగజ్యోతిని గెలిపించాలని అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుకే ఓటు వేయాలని అభ్యర్థన
- స్వరాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తున్న నాయకులు, కార్యకర్తలు
- పుట్ట మధూకర్, బడే నాగజ్యోతిని గెలిపించాలని వినతి

మహదేవపూర్, నవంబర్ 19 : మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో బీఆర్ఎస్ శ్రేణులు ప్రచారంలో దూసుకెళ్తున్నాయి. ఆదివారం ఇంటింటికీ వెళ్లి ఓటు అభ్యర్థించారు. బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టో, అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. మ్యానిఫెస్టో ప్రతులను ప్రజలకు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్‌రావు, సర్పంచ్ శ్రీపతిబాపు, ఉప సర్పంచ్ సల్మాన్‌ఖాన్, బీఆర్ఎస్ మహిళా డివిజన్ అధ్యక్షురాలు కేదారి గీత, కాళేశ్వర ఆలయ ధర్మకర్త కలికోట దేవేందర్, కాళేశ్వర ఆలయ మాజీ చైర్మన్ వెంకటస్వామి, ఉపాధ్యక్షుడు రామయ్య, మహిళా మండల అధ్యక్షురాలు ఓడేటి స్వప్న, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు జక్కయ్య, పట్టణ అధ్యక్షుడు కే రాకేశ్, మండల యూత్ అధ్యక్షుడు అలీంఖాన్, సీనియర్ నాయకులు అన్కారీ ప్రభాకర్, తడకల రమేశ్, శ్రీహరి, తలారి గట్టయ్య, యూత్ పట్టణ అధ్యక్షుడు రేవెళ్లి రాజశేఖర్, బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**గంగారంలో..**

గంగారం : ములుగు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతికి ఓటేసి గెలిపించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఓటర్లను కోరారు. ఆదివారం చింతగూడెం, జంగాలపల్లి, కాటినాగారం, కోమట్లగూడెం, నర్సుగూడెం, పెద్దెల్లాపురం గ్రామాల్లో బీఆర్ఎస్ శ్రేణులు ఇంటింటా ఇంటింటా ప్రచారం చేపట్టారు. ములుగు గడ్డపై గులాబీ జెండా ఎగరెయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, సూరయ్య, లక్ష్మయ్య, సతీశ్, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.



మహదేవపూర్ : సభకు తరలి వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

## ప్రజా ఆశీర్వాద సభకు తరలిన బీఆర్ఎస్ నాయకులు

మహదేవపూర్, నవంబర్ 19 : కాటారంలోని మినీ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రజా ఆశీర్వాద బహిరంగ సభకు మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్ రావు, సర్పంచ్ శ్రీపతిబాపు, ఏఎంసీ చైర్ పర్సన్ పెండ్యాల మమతా మనోహర్, డివిజన్ మహిళా అధ్యక్షురాలు కేదారి గీత, మహిళా మండల అధ్యక్షురాలు స్వప్న, ఉప సర్పంచ్ సల్మాన్‌ఖాన్, మండల యూత్ అధ్యక్షుడు అలీం, రాకేశ్, ప్రకాశ్, పోత వెంకటస్వామి, తడకల రమేశ్, శ్రీహరి, తలారి గట్టయ్య బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

**మహాముత్తారంలో..**

మహాముత్తారం : మండల కేంద్రంలో ఎమ్మెల్సీ కవిత బహిరంగ సభకు మండలం నుంచి గులాబీ శ్రేణులు తరలి వెళ్లాయి. జై తెలంగాణ .. జై కేసీఆర్..జై పుట్ట మధు అంటు నినాదాలు చేశారు. గ్రామాల్లో గులాబీ శ్రేణులు ఒకే దగ్గరకు చేరుకోవడంతో గులాబీమయం అయ్యింది.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

ఏటూరునాగారం, నవంబర్ 19 : మండలంలోని రామన్నగూడెంలో మృతురాలి కుటుంబానికి గ్రామస్తులు ఆదివారం ఆర్థిక సాయం అందించారు. గ్రామానికి చెందిన గోరంట్ల అనసూయ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె పెద్ద కర్మ నిర్వహణకు గ్రామ పెద్ద పల్ల మాణిక్యం ఆధ్వర్యంలో రూ. 16,500లు సేకరించి మృతురాలి మనుమడు అఖిలేశ్‌కు అందజేశారు. అల్లి శ్రీనివాస్, ముత్తినేని సత్యం, అల్లి రఘు, తాళ్లపెల్లి గోపి, తోట మహేశ్, అల్లి రంజిత్, శ్రీరాం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్లంబర్స్ జిల్లా యూనియన్ ఎన్నిక

ములుగురూరల్, నవంబర్19 : ములుగు జిల్లా ప్లంబర్స్ యూనియన్‌ను ఆదివారం జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఊకంటి కిరణ్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా పోరిక శ్రీనివాస్, కార్యదర్శిగా ఊకంటి కిశోర్ రెడ్డి, కోశాధికారిగా అజ్మీరా రత్, సలహాదారులుగా వలీ, శ్రీను, పాలె బెనర్జీ, కిరణ్, సమ్మయ్యను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులకు పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు.



ఎన్నికైన ప్లంబర్స్ యూనియన్ సభ్యులు



ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న విద్యార్థులు

## రామప్పలో సండే సందడి

- సందర్శించిన రొమేనియా దేశస్తుడు
- ఆలయంలో ప్రత్యేక పూజలు

వెంకటాపూర్, నవంబర్ 19 : మండలంలోని రామప్ప దేవాలయం ఆదివారం పర్యాటకులు, విద్యార్థులు, భక్తులతో సందడిగా మారింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో పర్యాటకులు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. రొమేనియా దేశస్తుడు విక్టర్ ఆదివారం తన స్నేహితులతో కలిసి సందర్శించారు. ఆలయంలో పూజలు చేశారు. ఆలయ చరిత్ర, విశిష్టతను టూరిజం గైడ్స్ వివరించగా ఆసక్తిగా విని ఆనందం వ్యక్తం చేశారు. ఆలయంలో ఫొటోలు దిగారు. అనంతరం రామప్ప సరస్సులో బోటింగ్ చేసి ఆహ్లాదంగా గడిపారు.

**అలరించిన ఫొటో ఎగ్జిబిషన్**

రామప్ప దేవాలయంలో ఆదివారం ప్రపంచ వారసత్వ వారోత్సవాల్లో భాగంగా కేంద్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆర్కియాలజిస్ట్ రోహిణి పాండే ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. భారతదేశంలోని 42 ప్రపంచ వారసత్వ ప్రదేశాల ఫొటోలతో పాటు, వాటి ప్రాముఖ్యత, అవి ఏయే రాష్ట్రాల్లో ఉన్నవి, ఎలా వెళ్లాలనేది వాటిలో వివరించారు. ఆలయ సందర్శనకు వచ్చిన పర్యాటకులు, విద్యార్థులతో పాటు స్థానిక ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు సందర్శించారు. ఆయా ప్రదేశాల ప్రాముఖ్యతను సీఏ మల్లేశ్ వివరించారు. కార్యక్రమంలో గార్డెన్ ఫోర్‌మెన్ ప్రదీప్‌బాబు, కో ఆర్డినేటర్ కుమారస్వామి, పురావస్తు, దేవాదాయ, టూరిజం శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



బాధితుడు శ్రీశైలం కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

## స్నేహితుడి కుటుంబానికి చేయూత

గోవిందరావుపేట, నవంబర్ 19 : మండలంలోని పస్రా గ్రామానికి చెందిన పాక శ్రీశైలం కుమార్తె శ్రీజ డెంగ్యూతో ఇటీవల మృతి చెందింది. కాగా, శ్రీశైలంతో 1996-97లో 10వ తరగతి విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆయనను పరామర్శించారు. ఈ మేరకు రూ. 42,500 ఆర్థిక సాయంగా అందజేశారు. స్నేహితుడి కుటుంబానికి అండగా ఉంటామని వారు హామీ ఇచ్చారు.



సమ్మక్క దేవతకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

## మేడారంలో భక్తుల సందడి

తాడ్వాయి, నవంబర్ 19 : వనదేవతలు మేడారం సమ్మక్క, సారలమ్మను భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. ఆదివారం సెలవు కావడంతో రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి ప్రైవేటు వాహనాల్లో భక్తులు వచ్చారు. మొదట జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. గద్దెలపై పసుపు, కుంకుమ, సారె, పూలు, పండ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వంట చేసుకుని విందు భోజనాలు చేస్తూ ఉల్లాసంగా గడుపుతున్నారు.

**కాళేశ్వరంలో ..**

కాళేశ్వరం: కాళేశ్వర ముక్తీశ్వరస్వామి వారి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ముందుగా భక్తులు గోదావరి తీరంలో పుణ్యస్నానాలు ఆచరించి గోదావరి మాతకు ప్రత్యేక పూజలు చేసి దీపాలు వదిలారు. అనంతరం ఆలయానికి వచ్చి స్వామి వారికి అభిషేకం చేశారు. లడ్డూ ప్రసాదం తీసుకొని వెనుదిరిగారు.

# బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న చేరికలు

కాటారం, నవంబర్ 19 : మండల కేంద్రంలోని హమాలీవాడకు చెందిన సుమారు 50 మంది బీఆర్ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు సమక్షంలో పార్టీలో చేరారు. వారికి మధు కండువాలు కప్పి ఆహ్వానించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కేసీఆర్ పాలన మెచ్చి పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తోట రాధమ్మ, బీఆర్ఎస్ రాష్ట్ర నేత జక్కు రాకేశ్, మండల అధ్యక్షుడు తోట జనార్దన్, యూత్ అధ్యక్షుడు రామిల్ల కిరణ్, సబ్ డివిజన్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు తైనేని సతీశ్, మండల ప్రధాన కార్యదర్శి జోడు శ్రీనివాస్, ఆర్బీఎస్ మండల అధ్యక్షుడు కే రాజబాబు, ఎస్సీ సెల్ నియోజక వర్గ అధ్యక్షుడు పంతకాని సడవలి తదితరులు పాల్గొన్నారు.

**మహదేవపూర్‌లో..**

మహదేవపూర్ : స్థానిక సర్పంచ్ శ్రీపతిబాపు ఆధ్వర్యంలో మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ యువజన నాయకులు, కార్యకర్తలు 20 మంది ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి సర్పంచ్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో శామ్యూల్, పోతరవేని విక్రమ్, అట్టెం రాకేశ్, లక్ష్మీ ప్రసాద్, దబ్బెట మహేశ్, తోట జయచందర్ తదితరులు ఉన్నారు. పుట్ట మధూకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సల్మాన్‌ఖాన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పెండ్యాల మనోహర్, మండల ఉపాధ్యక్షుడు లింగాల రామయ్య, మండల యూత్ అధ్యక్షుడు అలీంఖాన్, పట్టణ అధ్యక్షుడు రేవెళ్లి రాజశేఖర్, మైనార్టీ నాయకులు అన్వర్‌ఖాన్, ఇక్తియాజ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కాటారం : బీఆర్ఎస్‌లో చేరుతున్న వారికి కండువాలు కప్పుతున్న పుట్ట మధు



మహదేవపూర్ : పార్టీలోకి ఆహ్వానిస్తున్న సర్పంచ్ శ్రీపతిబాపు